గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ వి.శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంద్ర రకం వరి విత్తనాలను 50 శాతం సబ్సిడీపై 25 ఎకరాలకు గాను 30 మంది రైతులకు అందజేసినట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో నేలమ్మం తయారీ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ యం.రమాదేవి, విపిఏ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బంజరు భూము సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

విశాలాంధ్ర - కోటవురట్ల: మండలంలో బంజరు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న సాగుదారులందరికీ తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిమ్మాపురం గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి కొళ్ళ రాంబాబు అధ్యక్షతన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సంక్షేమ అభివృద్ధి సమపాలలో అందించాలన్నారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న జల్లూరు, పొడూరు బ్రిడ్జిలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నర్సీపట్నం నుండి అడ్డరోడ్డు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు గోతులమయంగా అస్తవ్యస్తంగా ఉన్నందున ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంజరు భూములు సాగులో ఉన్న హక్కుదారులందరికీ పట్టాలు మంజూరు చేసి అన్నదాత పథకం ద్వారా ప్రభుత్వం అందించే 20వేలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలన్నారు.

మండలంలో ఉన్న అనేక సమస్యలపై మండల కమిటీలో చర్చించి వాటి పరిష్కారానికి తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద త్వరలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. ఆగస్టు 6న నర్సీపట్నంలో జరుగు జనరల్ బాడీ సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు, మండల సీపీఐ కార్యదర్శి సింగంపల్లి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొల్లు సూరిబాబు, వేణుబాబు సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఈజెడ్‌లో ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో గల ఫార్మాసిటీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో తరచు జరుగుతున్న ప్రమాదాలలో కార్మికుల ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులైన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్‌లో గల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రత ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై నిబంధన ప్రకారం పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించడానికి సాధ్యమవుతుందని దొరబాబు అన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కంపెనీ యాజమాన్యాలతో లాలూచీ పడడం వల్లే ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని దొరబాబు ఆరోపించారు. పరిశ్రమలలో కాలం చెల్లిన రియాక్టర్లు వాడడం వల్ల రియాక్టర్లు పేలి అనేకమంది కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సక్రమంగా వ్యవహరించలేదని విమర్శించారు. ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై నియమించిన విచారణ కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.శ్రీనాథ్, జిల్లా నాయకులు విత్తనాల పోతురాజు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల సమస్యలపై దృష్టిసారించాలి

విశాలాంధ్ర - కసింకోట: మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌ఛార్జ్ సూదికొండ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. సూదికొండ మాణిక్యాలరావు, కాంగ్రెస్ పార్టీ నేత కట్టుమూరి నూకి అప్పారావు, మహా జన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి కొల్లి సత్తారావు, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక జిల్లా అధ్యక్షులు పెట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. అనకాపల్లి మండలంలోని పలు గ్రామాలలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, మురికి నీటి కాలువల నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని, కొత్తూరు జంక్షన్‌లో ప్రజల కొరకు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. సత్యనారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలో మూలపేట గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి, మురికినీటి కాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, మూలపేట గ్రామంలో మంచినీటి ఇబ్బంది తొలగించడం కోసం అవసరమైన చోట్ల మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని అన్నారు. పందుల సంచారం వలన ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ప్రజలకు అంటువ్యాధులు జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను ముఖ్యంగా చిన్నపిల్లలను భయాందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పందులు కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు

జిల్లా రిజిస్ట్రార్ జానకి దేవి

విశాలాంధ్ర - కే.కోటపాడు: జిల్లాలో ఉన్న పది సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్టర్ సిహెచ్ జానకి దేవి తెలిపారు. గురువారం కే.కోటపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. కార్యాలయానికి కావలసిన ఫర్నిచర్ రికార్డులు భద్రపరిచే బీరువాలు కార్యాలయం బయట సీసీ కెమెరాలు ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం కన్నా 660 డాక్యుమెంట్లు తగ్గాయి అన్నారు. 2023లో 20వేలు డాక్యుమెంట్లు చేశామని ఈ సంవత్సరం 13వేలు మాత్రమే చేయగలిగామన్నారు. నాలుగు నెలల నుండి ఎన్నికలు, మంచి ముహార్తాలు లేకపోవడం తదితర కారణాల వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గాయన్నారు. జిల్లాలో కే.కోటపాడు, నక్కపల్లి, మాడుగుల సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వీటికి త్వరలో సొంత భవనాలు సమకూర్చవలసిందిగా జిల్లా కలెక్టరును కోరామన్నారు. అలాగే మిగిలిన భవనాలు కూడా శిథిలావస్థలో ఉండటంతో పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని ఆమె తెలిపారు. జిల్లాలో లంకెలపాలెం, ఎలమంచిలి తప్ప మిగిలిన కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తిగా తగ్గు ముఖం పట్టాయని తెలిపారు. ఆమెతోపాటు స్థానిక సబ్ రిజిస్టర్ బంగారి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హత్యాకాండపై కేంద్ర హోంశాఖ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్రంలో జరుగుతున్న హత్యాకాండపై కేంద్ర హోంశాఖ చర్యలు చేపట్టాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. పాయకరావుపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు మద్దతు ప్రకటించారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో 35 హత్యలు జరిగాయని జగన్ ఆరోపణలు వాస్తవమేనన్నారు. ముస్లిం, క్రిస్టియన్లపై, దళితులపై దాడులు జరిగాయన్నారు. గతంలో టిడిపి నేతలను జగన్ ప్రభుత్వం వేధింపులకు గురి చేశారని, ప్రస్తుతం వైసీపీ, ఇతర పక్షాల నేతల సంగతి తెలుస్తామని మంత్రులు బహిరంగంగానే చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు విభాగం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరివేరి వసంతరావు, రాష్ట్ర కన్వీనర్ గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర - కోటవురట్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని డీఎల్‌పీఓ ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి అన్నారు. గురువారం ఆయన కోటవురట్ల పంచాయతీలో ముస్లిం వీధి, సీతారామరాజు నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా మంచినీటి ట్యాంకర్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న తుప్పలు డొంకలు, డ్రైనేజీలో పేరుకుపోయిన మురికిని తొలగించే కార్యక్రమాలు సిబ్బందితో చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25 నుండి ఆగస్టు 10 వరకు ప్రతి గ్రామం లో గ్రామ సభలు నిర్వహించి పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రపరచడం, వాటర్ క్లోరినేషన్ చేయడం, దోమల నివారణకు చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు త్వరితగతిన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాధరావు, ఇన్చార్జ్ ఈఓపీఆర్డీ సోమినాయుడు, కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు, ఎంపీటీసీ పీవీ సూర్యారావు, వీఆర్వో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వంలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: జనసేన పార్టీ నిర్వహించే సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జనసేన పార్టీ మాడుగుల మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుండి మొదలైన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 28 వరకు జరుగుతుందన్నారు. 4వ విడత జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కొత్త సభ్యత్వ నమోదుతో పాటు, సభ్యత్వ రెన్యువల్ కార్యక్రమం చేపడం జరుగుతుందని చెప్పారు. రాజకీయాల్లో సరికొత్త మార్పు తీసుకొచ్చేందుకు పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని కొనియాడారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వివిధ పార్టీల నుండి జనసేనలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మంచి సత్ఫలితాలు

విశాలాంధ్ర - రావికమతం: దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వలన మంచి సత్ఫలితాలను సాధించ వచ్చని ఎం.ఈ.వో సి.హెచ్.తలుపులు అన్నారు. రావి కమతం భవిత కేంద్రంలో నూతనంగా నియమితులైన ఫిజియోథెరపిస్ట్ లావణ్యచే ఫిజియోథెరపీ సేవను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి 11 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారని, అలాగే ఇకనుండి ప్రతి సోమవారం రావికమతం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను ఫిజియోథెరపీ అవసరమైన దివ్యాంగ విద్యార్థులందరూ వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, మహాలక్ష్మి నాయుడు, సరోజిని, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హైస్కూల్లో శిక్షా సప్తాహ్

విశాలాంధ్ర - పరవాడ: శిక్షా సప్తాహ్ నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా పరవాడ బాయ్స్ హైస్కూల్‌లో గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే మన ప్రాథమిక సూత్రాన్ని అలవర్చుకోవాలన్నారు. వివిధ భాషలు, మతాలు, సాంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన భారతీయులంతా ఒక్కటే (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్) అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్.ఎం బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

భారత క్రీడాకారులకు సంఘీభావం

విశాలాంధ్ర - నక్కపల్లి: పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ తరఫున పాల్గొనే క్రీడాకారులకు సంఘీభావంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి లలిత, బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ ఆధ్వర్యంలో జై భారత్ జై జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశం తరఫున పాల్గొంటున్న అన్ని క్రీడా విభాగాలలో పతకాలు సాధించి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్ రాంబాబు, రజినీ ఉపాధ్యాయులు టి.వి.రమణ, వి.సత్యవతి, టి.సుందరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.కె.బి.బి, కిరణ్మయి, రమా కుమారి, శ్రీదేవి, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున పాల్గొను క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించాలని కోరుతూ గురువారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో బెస్ట్ ఆఫ్ లక్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. రేపటి నుండి జరగనున్న ఒలింపిక్స్ క్రీడలలో పాల్గొనుచున్న మనదేశ క్రీడాకారులకు సంతకాల సేకరణతో శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమం గ్రంథాలయాధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలుపుతూ ఇచ్చిన అభినందన పత్రము ప్రదర్శించారు. నర్సీపట్నం ఎస్ఐ సుధాకర్, ఆర్ఎస్ఎం చర్చి రేవ ఫాదర్ శౌరిబాబు, నర్సీపట్నం ఎంఈఓ నాగేంద్ర, నాతవరం ఎంఈఓ వరహాల బాబు, యలమంచిలి మండల మాస్టర్ (విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు), శ్రీరామరాజు, రాష్ట్ర ఉత్తమ వ్యాయామ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్, విశ్రాంత గ్రంథాలయాధికారులు జి.మురళీ కృష్ణ, కే.త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో వెండి పతకం సాధించిన వ్యాయామ ఉపాధ్యాయిని జి.దేవి ఘనంగా సన్మానించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం

విశాలాంధ్ర - నక్కపల్లి: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన అన్యాయంపై నక్కపల్లి మండలం ఎన్.నరసాపురం గ్రామంలో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం వంటి సాగునీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించ, విశాఖ రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ వంటి అనేక అంశాలను తుంగలో తొక్కిందని అన్నారు. నక్కపల్లి క్లస్టర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించ లేదని తెలిపారు. బీజేపీ ఎంపీ సీఎం రమేష్, కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి గత బడ్జెట్ కంటే 4 వేల కోట్ల రూపాయలు నిధులు తగ్గించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గొర్ల రమణ, మనబాల రమణ, మనబాల శ్రీను, సారిపల్లి శివ, పల్లా స్వామి, పల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: మున్సిపాలిటీలో గ్రావిటీ సరఫరాకు సంబంధించిన సోమిదేవపల్లిలో హెడ్ వాటర్ వర్క్స్ నకు విద్యుత్ సరఫరాకు 26వ తేదీన అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ ఇంజనీర్ అధికారి తెలిపారు. యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో ధర్మవరం, కొత్త పేట, మిలిట్రీ కాలనీ, గాంధీనగర్, కోర్టు పేట, భవనం వీధి, యర్రవరం వార్డులకు నీటి సరఫరా జరగదని తెలిపారు.

దళితుల శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండల కేంద్రంలోని దళితుల శ్మశాన వాటికను స్థానికులు ఆక్రమించి సాగు చేస్తున్నారని స్థానిక అంబేద్కర్ యూత్ సంఘం, ఎస్సీ కాలనీ పెద్దలు ఆరోపించారు. ఈ మేరకు తహశీల్దార్ జి.లక్ష్మీనారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. దళితుల శ్మశాన వాటిక దేవరాపల్లి రెవెన్యూ పరిధిలోని 274/1లో 4 ఎకరాల 64 సెంట్లు విస్తీర్ణం ఉంది. అందులో కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో ఈ విషయాన్ని గుర్తించిన అంబేద్కర్ యూత్ సంఘ సభ్యులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహశీల్దార్ తక్షణమే స్పందిస్తూ వెంటనే శ్మశాన వాటికను సర్వే చేసి దళితులకు అప్పగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సర్వేయర్ నాయుడు, వీఆర్వో బి.నాగేశ్వరరావు సర్వే జరిపి అందులో 61 సెంట్లు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి, సరిహద్దులు వేసి దళితులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై వివాదం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలం ఆక్రమణపై వివాదం చోటు చేసుకుంది. ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా ప్రహరీని తొలగించి నూతనంగా నిర్మించేందుకు సిద్ధమయ్యారు. అయితే పక్కనే ఉన్న స్థల యజమాని పడాల సోమన్నదొర తన స్థలం ఆసుపత్రి స్థలంలో కలిసి పోయిందని సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి స్థలం ఆక్రమణకు గురవుతుందని స్థానిక నాయకులు వెలుగుల అర్జున్‌రావు, జగతా శ్రీనివాస్, చిక్కాల శ్రీనివాసరావు, ధనిశెట్టి బుజ్జి, వేములపూడి అప్పారావు అభ్యంతరం తెలిపారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా సర్వేయర్ సత్యనారాయణ వచ్చి హద్దులు నిర్ణయించారు. రికార్డులు ఉంటే కోర్టులో తేల్చుకోమని పడాల సోమన్నదొరకు సూచించారు. గతంలో ఉన్న ప్రదేశంలోనే ఆసుపత్రి ప్రహరీ నిర్మించాలని సూచించారు.

మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మత్స్యకారులకు వేట నిషేధ భృతి 20 వేలు ఇవ్వాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజకు ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ప్రతి సంవత్సరం అర్హులైన మత్స్యకారులకు ఏప్రిల్, మే నెలలో వేట నిషేధ కాలంగా భావించి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేట నిషేధ భృతి 20 వేలు అందిస్తామన్నారు. అలాగే గత వారం రోజులుగా అల్పపీడనం, వాయుగుండం కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మత్స్యకారులు బాధలను అర్థం చేసుకొని, వేట నిషేధ సహాయంతో పాటు, తుఫాను కారణంగా నిత్యావసర సరుకులు అందించి ఆదుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము, జి.దేవునాయుడు, చేపల తాతయ్య, చెల్లూరి నూకన్న, మైలపల్లి రమణ, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

చోరీపై ముమ్మర దర్యాప్తు

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి పట్టణంలోని వీవర్స్ కాలనీలోని ఒక ఇంటిలో జరిగిన చోరీపై సీఐ అంబటి విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై సన్నిబాబు పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీం చేరుకొని ఆధారాలను అనుసరించారు. కొద్ది రోజుల్లోనే గుర్తిస్తామని ఎస్సై సన్నీ బాబు స్థానిక విలేకరులకు తెలిపారు.

వైసీపీ నేత ఈశ్వరరావును పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో దార్లపూడి గ్రామంలోని వైసీపీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావును మండల వైసీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు భార్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన మండల వైసీపీ నాయకులతో పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కొమ్ము జగదీష్, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక గ్రామంలో గురువారం పంచాయతీ సెక్రటరీ పద్మ, సర్పంచ్ నాయని సత్యనారాయణ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, జనసేన సభ్యులు కుమార్, నాగు ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ రోడ్, గ్రామంలో గల రోడ్లకి ఇరువైపుల ఉన్న పిచ్చి తుప్పలు తొలగించారు. అనంతరం మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు బోర్లు కొళాయిలు వద్ద పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, సచివాలయం సిబ్బందితో పాటు మల్లు నాయుడు, సత్తిబాబు, ఇరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవం

విశాలాంధ్ర - చోడవరం: విద్యా వారోత్సవాల్లో భాగంగా గాంధీ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో గురువారం సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎం.ఈ.ఓ. జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్.ఈ.పి) నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు వివరించారు. జాతీయ విద్యా విధానాన్ని దేశవ్యాప్తంగా ఆరంభించడం మొదలై ఇప్పటికీ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నామన్నారు. దీనిని పురస్కరించుకుని శిక్షా సప్తాహ్/విద్యా వారోత్సవాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి :2
అనకాపల్లి
శుక్రవారం 26, జూలై, 2024

ఇళ్ల స్థలాలలో విషయంలో రాజకీయ జోక్యం వద్దు

లబ్ధిదారులకు అన్యాయం జరిగితే బహిరంగ చర్చకు సిద్ధం

విశాలాంధ్ర - అనందపురం: మండలం వేములవలస ఇళ్ల స్థలాలలో రాజకీయ జోక్యం విడనాడి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని వేముల వలస జగనన్న కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వేములవలస జగనన్న కాలనీ ఇల్లు 377 మందిలో సుమారు 95 మందికి మొదట విడతగా ఇవ్వడం జరిగిందని ఇందులో మృతులకు ఇల్లు మంజూరు చేసినట్లు కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని నిజా నిజాలు పరిశీలన చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల ఎంపికలో 2020 లో పట్టాలు మంజూరు చేయడం జరిగిందని అప్పట్నుండి పలు రాజకీయాల వలన ఇళ్ల పట్టాల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వే నెంబరు 151/1 లో 95 వందమందికి ఇళ్ల స్థలాల మంజూరు చేయడం జరిగిందని సర్వేనెంబర్ 155లో మిగిలిన వారికి పట్టాలు అందజేసి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోరాడ సూరి కుమారి, రాంబాబు, లబ్ధిదారులు బసవయ్య ,రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ డైమండ్స్‌కు నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక హోటల్‌లో నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను అధ్యక్షురాలుగా రొటేరియన్ ఆర్.నీరజ, కార్యదర్శిగా రొటేరియన్.ఎస్ కామేశ్వరరావు, కోశాధికారిగా రొటేరియన్ ఎన్వి నాగమన్నారులతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ డైమండ్స్ రానున్న రోజులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు, సంఘానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ రొటేరియన్ డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా బోర్డు సభ్యులను డీజీ వెంకటేశ్వర రావు , డీజీ డీఆర్ వై కళ్యాణ్ చక్రవర్తి వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

27న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు శిక్షణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: చట్టివానిపాలెం బివియన్ స్కూల్లో జిప్సా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాల నిర్వహణకు సంభందించిన అనేక విషయాలపై చర్చించారు. ఈనెల 27వ తేదీన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు శిక్షణ నిర్వహించనున్నట్టు పాతగాజువాక చైతన్య నగర్‌లో గల శ్రీ సూర్యతేజ్ స్కూల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయ భాస్కర్ గారు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాసరావు, సభ్యులు యమ్. జగ్గారావు, పి. మురళీ సుందర్, సత్యన్నారాయణ, రమేష్ నాయుడు, రాము, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన నేతలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను 75వ వార్డు నేతలు కలిశారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, తెలుగుదేశం నాయకులు ములకలపల్లి పెంటయ్య, కాకినాడ అప్పల రాజు, అప్పల రెడ్డి, పెంటయ్య తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటానమస్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - యలమంచిలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల యలమంచిలి ఎంఏఏసిలో 'ఏ' గ్రేడ్ సాధించినందున యుజిసి వారు అటానమస్ స్టేటస్‌ను 2024 - 2025 విద్యా సంవత్సరము నుండి 2033-2034 వరకు, అనగా 10 సంవత్సరాల పాటు అటానమస్ స్టేటస్ ఇచ్చియున్నారు. ఈ అటానమస్ స్టేటస్ వలన విద్యార్థులకు అవసరమైన సిలబస్ తయారు చేయటం కొచెన్ బ్యాంక్స్ తయారు చేయటం మోడల్ పేపర్లు తయారు చేయడం మిడ్ ఎగ్జామినేషన్లు మరియు పబ్లిక్ ఎగ్జామినేషన్లు అన్నియు ఈ కళాశాల వారే నిర్వహించవలసి ఉంది. పరీక్ష పత్రాల వ్యాల్యూషన్ చేయటము రిజల్ట్స్ డిక్లేర్ చేయటము సర్టిఫికెట్లు తయారు చేయడం మొదలగు అన్ని పనులు ఈ కళాశాలలోనే జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వివిధ యూనివర్సిటీల నుండి మరియు అనుబంధ కళాశాల నుండి సీనియర్ లెక్చరర్స్ ప్రొఫెసర్లు ఈ కళాశాలకు విచ్చేసి అన్ని పనులను వారి సమక్షంలోనే ప్రారంభించారు. దీనివలన ఈ కళాశాలలో చదివిన స్టూడెంట్స్ అందరకూ సకాలంలోనే మంచి సిలబస్ తో పరీక్షల నిర్వహణ జరిగి రిజల్ట్స్ సకాలంలోనే వచ్చి జాతీయస్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సులువు అవుతుంది.

పాముకాటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పెంట గ్రామానికి చెందిన చెప్ప .జగన్నాథం (52) పాముకాటుతో మృతి చెందాడని పద్మనాభం పోలీసులు తెలిపారు. పొలంలో కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర - పాయక రావుపేట: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటనగరం గ్రామంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం జ్ఞానేశ్వరి, హరికృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్య పనులు చేపట్టారు. పెంటకోట, రాజవరం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ, మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేయించడంతోపాటు, రోడ్డుకు ఇరుపక్కన ఉన్న తుప్పలను, మట్టి కుప్పలను తొలగించారు. ఈఓపీఆర్‌డి సీహెచ్ చంద్రశేఖర్ పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆధార్ సేవల పనితీరు, చెత్త నుండి సందవ తయారీ కేంద్రాలను పరిశీలించారు.

మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి శిక్ష

విశాలాంధ్ర - ఆనందపురం: మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20సం.ల కఠిన కారాగార శిక్ష రూ.10,000/- జరిమానాను కోర్టు విధించింది. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో, ముద్దాయి ఉప్పాడ గౌరీ శంకర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా ప్రభుత్వము నుండి బాధితురాలికి రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలని సంచలన తీర్పు వెలువరించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - రావికమతం: కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రావికమతం మండల విద్యుత్ శాఖ ఏఈ నందన్ చెప్పారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతున్న దృశ్య జంగిల్ క్లియరెన్స్‌తో పాటు వార్షిక ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపడుతున్నట్టు ఏఈ వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ నందన్ పేర్కొన్నారు..

విద్యార్థులకు అభ్యసన సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని వెంకోజీ పాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన "కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ" అభ్యసన సామాగ్రిని పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బిఎస్ సుబ్బారావు పరీక్ష అట్టలు, పుస్తకాలు, పెన్సిల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎస్.అనిత, కార్యదర్శి డి.నరేంద్ర పాల్గొన్నారు. కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ గతంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా ఈ కార్యక్రమం తమకు ఎంతో సంతృప్తిని కలిగించిందని సంస్థ అధ్యక్షులు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మరిడితల్లి పండగ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం గోవిందమ్మ కొలనీలో గల మరిడిమహాలక్ష్మి అమ్మవారి పండుగను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోటవీది, గండి కోలనీలో గల వివిధ హిందూ, యాదవ్ కుటుంబాలు శ్రీ శ్రీ శ్రీ మరిడితల్లి అమ్మవారి పండుగను అత్యంత వైభవంగా, సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గండి కోలని లో వెలసిన శ్రీ పోతురాజు స్వామి ని దర్శించి తదుపరి గోవిందమ్మ కోలనిలో ఉన్న మరిడమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు గా 70 కు పైగా యాదవ్ కుటుంబాలు, 250 పైగా సభ్యులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 217 రద్దు పట్ల హర్షం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీఓ నెంబర్ 217ను రద్దు చేయడం పట్ల జాతీయ మత్స్యకార సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర మత్స్యకార మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మత్స్యకార కమీషనర్ డోలా శంకర్, మత్స్యకార ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు వేట నిషేద భృతి, సముద్ర తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల నాశనం అవుతున్న మత్స్య సంపద గురించి వివరించారు. అలాగే మత్స్యకారుల కోసం సంక్షేమ పథకాలు ఏర్పాటు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మోసా అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి ఒరుపుల జయశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకాక్షరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మైలపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: విద్యార్థులు విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని 13వ ఆంధ్రా ఎన్‌సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో స్కూల్ కెప్టెన్లు, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పదేళ్లపాటు కష్టపడితే మంచి ఫలితాలు సాదించవచ్చని తెలిపారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎవరి భవిష్యత్తుకు వారే మార్గదర్శకులని తెలిపారు. దేశానికి కావలసిన నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుండి పెంపొందించుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి రాజీలేని పోరాటం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కార్మిక సంక్షేమ విషయంలో రాజీలేని పోరాటం చేస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు నేడు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వేతన సవరణ కోసం ఏడేళ్లగా ఎదురు చూస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్లో మెర్జ్ చేయాలని, అప్పుడే ప్లాంట్కు పూర్వ వైభవం వస్తుందన్నారు. యాజ మాన్యం దుర్మార్గ ఆలోచనలు మాని ప్లాంట్ ప్రగతి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్లాంట్లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, కొవిరి అవతారం, బీఎన్. రాజు, కొమ్ము ప్రసాద్, రమణమూర్తి, ఆకుల నూకరాజు, జగదీష్కుమార్, పోలీస్ నాయుడు, రవికుమార్, నర్సింగరావు, నాయుడు, గంగవరం గోపి, సుదర్శనరావు, డి.మోహన్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

విశాలంధ్ర - అచ్యుతాపురం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన అన్యాయంపై గురువారం సిపిఎం రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ వంటి అనేక అంశాలను తుంగలో తొక్కిందన్నారు. రాంబిల్లి, నక్కపల్లి క్లస్టర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి దేవుడునాయుడు, సిపిఎం నాయకులు చింతకాయల శివాజీ, కూండ్రపు సోమనాయుడు, నూకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని

పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి : కళాశాల, పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో పెందుర్తి కళాశాల నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయ సిబ్బందికి కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు జూనియర్ కళాశాలలో కొన్ని సబ్జెక్టులకు ఫ్యాకల్టీ కూడా లేకపోవడం చాలా దౌర్భాగ్యం అని పేర్కొన్నారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా మాట్లాడుతూ విద్యార్థులకు కాంగ్రెస్ నుండి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు సమస్యలు పరిష్కారం కాని పక్షంలో తాము కూడా ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెందుర్తి జూనియర్ కళాశాలకు ప్రహరీని నిర్మించాలని, పెందుర్తి ప్రాంతంలో బాలికల సంక్షేమ హాస్టల్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ నాయకులు కార్తీక్, మహేంద్ర మోహన్ రాజేష్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మోహన్ రెడ్డికి ప్రజలపై ఏమాత్రం అభిమానం లేదు

-టిడిపి నేత బైరెడ్డి పోతన రెడ్డి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలపై ఏమాత్రం అభిమానం లేదని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు, ఆ పార్టీ జోన్- 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించే ఉద్దేశ్యం జగన్ అండ్ కోకి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఓట్లతో గెలిచిన వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభకు దూరంమవుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే శాసనసభ సమావేశాల్లో పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించాలని వైసిపి ఎమ్మెల్యేలకు సూచించారు. గౌరవప్రదమైన సభలో పాల్గొని ప్రభుత్వానికి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై వైసిపి ఎమ్మెల్యేలు సూచనలు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలు తమకు తక్కువ సీట్లు ఇచ్చారనే అక్కసుతో జగన్ శాసనసభ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని భావించాల్సి వస్తుందని తెలిపారు. శాసనసభ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినట్లేనని పోతన రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంకా జగన్ కి అధికారం పై వ్యామోహం పోలేదని అన్నారు. శాసనసభ సమావేశాలకు హాజరు కాకుండా ప్రతిపక్ష హోదా కావాలంటూ జగన్ హైకోర్టును ఆశ్రయించడాన్ని ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి జగన్ కు రాష్ట్రం, ప్రజల కంటే అధికార దర్పమే కావాలని మరోసారి తేటతెల్లమైందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం, అరాచకాలే తప్పా అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని, నియంత పాలన సాగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగానికి తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన జగన్ ఢిల్లీలో ఆందోళన నిర్వహించడాన్ని తప్పుపట్టారు. ఎన్డీఏ కూటమి సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు.